# యాప్‌లో విద్యార్థుల హాజరు

- ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి..
- నిత్యం ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్

మామడ, డిసెంబర్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల హాజరును పక్కాగా నమోదు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రిజిస్టర్‌లో అటెండెన్స్‌కు బదులు ఇక నుంచి ఫేస్ రికగ్నిజేషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. విద్యార్థులను ఫొటో తీసి ప్రత్యేకంగా రూపొందించిన డీఎస్ఈ –ఎఫ్ఆర్ఎస్ ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో రోజూ ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలను రాష్ట్ర స్థాయి అధికారులు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే వీలుంటుంది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యాక విద్యార్థులకు సంబంధించిన వివరాలు అందులో కనిపిస్తాయి. ఈ యాప్ ద్వారా ఎక్కువ రోజులు పాఠశాలకు హాజరు కానీ విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మట్లాడి బడికి విధిగా వచ్చేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**ఇబ్బందులను అధిగమించేందుకే..**

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాల విద్యార్థుల హాజరు పక్కాగా సేకరించేందుకు ప్రభుత్వం ఓ యాప్ ప్రవేశపెట్టింది. ఇందులో విద్యార్థి ఫొటో,వివరాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. పేరు, తండ్రి పేరు, గ్రామం, ఫోన్ నంబర్ తదితర వివరాలను నమోదు చేయాలి.ఈ కార్యక్రమంపై ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. దీంతో ఉపాధ్యాయులు యాప్



కొరిటికల్ పాఠశాలలో విద్యార్థి హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

లో వివరాలను నమోదు చేస్తున్నారు.ఈ ఫేస్ రికగ్నిజేషన్ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. విద్యార్థుల హాజరు ప్రకారం మధ్యాహ్న భోజనం ఎంత మందికి సిద్ధం చేయాలి. పౌష్టికాహారం




నమోదైన విద్యార్థుల హాజరు వివరాలు

పక్కాగా అందుతుందా లేదా అనేది తెలుసుకునే అవకాశం కల్పించారు. ఈ విధానంతో మంచి ఫలితాలు వస్తే దీనిని ఉపాధ్యాయులకు అమలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

### పక్కాగా హాజరు నమోదు చేస్తున్నాం..



మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీల్లో హాజరు నమోదు పక్కాగా తీసుకుంటున్నాం. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోనూ ఇదే పద్ధతి అమలు చేస్తున్నాం. ప్రస్తుతానికి హాజరు నమోదు మాత్రమే అమలు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్ పథకానికి సైతం అమలు చేస్తాం.

- ముత్యం, ఎంఈవో(మామడ)



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

## జిల్లా ఆత్యపాత్య నూతన కార్యవర్గం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 7 : నిర్మల్ జిల్లా ఆత్యపాత్య అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గ సమావేశానికి జిల్లాలోని 16 మండలాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరై జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వన్నెల భూమన్న, కార్యదర్శిగా సంజీవ్, కోశాధికారిగా జమునను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా డీవైఎస్‌వో నఫీ ఖాన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమణా రావు, తైక్వాండో ఉమ్మడి అధ్యక్షుడు రామారావు, సాఫ్ట్ బాల్ కార్యదర్శి అన్నపూర్ణ, నెల్ బాల్ కార్యదర్శి గంగాధర్, కేటా కార్యదర్శి భోజన్న, పీఈటీలు అభినందించారు.

## మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

మామడ, డిసెంబర్ 7 : మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పోనికి వనం, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నర్సరీలో 13 వేల మొక్కలు పెంచుతున్నామని పేర్కొన్నారు. ప్రతి పల్లె పచ్చదనంతో కళకళలాడాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి నాంపెల్లి రాణి, టెక్నికల్ అసిస్టెంట్ చరణ్ ఉన్నారు.



పొనికి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో గోవర్ధన్



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

## హనుమాన్ ఆలయంలో పూజలు

కుంటాల, డిసెంబర్ 7 : కుంటాల మండలం వెంకూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శిఖర కలశ స్థాపన పూజ అర్చకులు వినయ్‌పాండే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సిందే దత్తరాం పటేల్, ఉపాధ్యక్షుడు ఆడెపు రమేశ్, భోజారాం పటేల్, జే. మారుతి పటేల్, భుజంగ్ రావు పటేల్, భూషణ్ పటేల్, జానకిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను పెంపొందించాలి

లక్ష్మణచాంద, డిసెంబర్ 7 : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని వడ్యాల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అశోక్‌వర్మ పేర్కొన్నారు. గురువారం వడ్యాల్ ఉన్నత పాఠశాలలో పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేలా పాఠాలను బోధించాలని సూచించారు. విద్యార్థులు నూతనంగా తయారు చేసిన నమూనాలు, చిత్రాలను పాఠశాలలో ప్రదర్శించడం ద్వారా వారికి మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఆర్పీలు సాయన్న, గోవర్ధన్, సీఆర్పీ సుధాకర్, వివిద పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అశోక్‌వర్మ

## రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



భైంసా : రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ముథోల్ : విద్యార్థులకు యూనిఫాంలను అందజేస్తున్న గ్రామస్తులు

భైంసా, డిసెంబర్ 7 : మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు నిషిత, శశికాంత్ అండర్ 14 బాస్కెట్ బాల్ పోటీల్లో ఈ నెల 6న మంచిర్యాలలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వ్యాయమ ఉపాధ్యాయుడు డేవిడ్ బెనల్ తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు రంగారెడ్డిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

**ఆష్టాలో..**

ముథోల్, డిసెంబర్ 7 : మండలంలోని ఆష్టా గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి గురుకుల బాలికలు అండర్ – 18 ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రమణారెడ్డి తెలిపారు. వీడీసీ తరపున రూ. 8 వేలు, యూనిఫాంను విద్యార్థులకు అందజేశారు. అనంతరం వారిని సన్మానించారు. గ్రామ సర్పంచ్ సుకన్య రమేశ్, వీడీసీ చైర్మన్ ముస్కు సాయారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఉన్నారు.

**కస్బా విద్యార్థులు**

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 7 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 రగ్బీ క్రీడా పోటీల్లో కస్బా ఉన్నత పాఠశాలకు చెందిన సాయి చంద్, విఘ్నేశ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వాణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 10–12వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఎన్‌సీసీ అధికారి సాయన్న, పీడీ భూమన్న, తఫియోద్దీన్, లక్ష్మీపతి, నారాయణ, దశరథ్, తులసీ తదితరులు పాల్గొన్నారు.

## కార్డియాక్ పరికరం పనితీరుపై శిక్షణ

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 7 : జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం కార్డియాక్ ఏఈడీ పరికరం పనితీరుపై వైద్యులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధన్‌రాజ్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ వల్ల గుండె కొట్టుకోవడం ఆగిపోతే ఈ పరికరం తిరిగి గుండె కొట్టుకోవడానికి ఉపయోగపడు తుందని తెలిపారు. శిక్షకుడు షేక్ అలీం, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, రవీందర్, తదితరులున్నారు.



శిక్షణ ఇస్తున్న అలీమ్

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్ టౌన్, డిసెంబర్ 7 : నిర్మల్ జిల్లా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పెన్షనర్ల సంఘం భవనంలో నిర్వహించే ఈ శిబిరానికి హైదరాబాద్ గ్లోబల్ కంటి ఆసుపత్రి వైద్యులు హాజరవుతారని తెలిపారు. కంటి జబ్బులతో బాధపడుతున్న విశ్రాంత ఉద్యోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.